ఆంధ్రమహాభారతం - అవతరణ

సమారు తొమ్మిదివందలయేళ్ళక్రితం రాజరాజనరేంద్రుడనే రాజు గోదావరీ మండలంలో రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు గోదావరీ మండలాన్నే ఆకాలంలో వేంగి దేశమనేవారు.

రాజరాజు ధర్మపరాయణుడు. ఆకాలంలో జైనమతం, బౌద్ధమతంలాంటి ఇతరమతాలెన్నో బయల్దేరి సనాతన ధర్మం వెనకబడజొచ్చింది పాపం అంటే భయం, దేవుడంటే భక్తీపోయి అధర్మం ప్రబలుతోందనీ దాన్ని అరికట్టే మార్గాన్ని చూడాలనీ తోచి ఆ రాజేంద్రుడు తన కుల గురువూ, ఆస్థాన పండితుడూ, కవీ ఐన నన్నయ భట్టారకుణ్ణి రావించి, 'ఏంచేస్తే బాగుంటుందీ?' అని సలహా అడిగేడు.

'ధర్మబోధగావించే సద్గ్రంథాలను రచించి ప్రజలకు అందజేయడం ఒక మార్గం' అన్నాడు నన్నయభట్టు.

'వేదాలలో ఉండే సమస్తధర్మాలనూ కూర్చి వ్యాసమహర్షి సంస్కృతంలో మహాభారతం రచించాడు. దాన్ని మీరు తెనిగించి, సంస్కృతం తెలియని ఆంధ్రులకు ఉపకారం చెయ్యండి' అని కోరాడు రాజు.

నన్నయభట్టు కొంచెం తటపటాయించాడు.

రాజది గ్రహించి, 'భారతం మా పూర్వులైన చంద్రవంశపురాజుల గాథ అది ఆంధ్రభాషలో ప్రసిద్ధికెక్కాలని నా కోర్కె' అన్నాడు

నన్నయ్య అప్పుడుకూడా 'సరే' అనక పోవడంచూసి రాజు, 'గురువర్యా మీరు మహాపండితులు' మీవంటి కవితావిశారదులు ఆస్థానకవులుగా లభించడం అనే భాగ్యం మరే రాజుకూ పట్టలేదు. మీరు నా కోర్కెను మన్నించి ఆంధ్రభారతాన్ని రచించి నాకు కృతిఇస్తే, నాకీర్తి ఆచంద్రార్కంగా నిలిచిపోతుంది!' అన్నాడు.

నన్నయార్యుడు 'రాజేంద్రా, ఆంధ్రంలో రచనకు పూనుకోడానికి సందేహిస్తున్నానంటే కారణం లేకపోలేదు' అన్నాడు

'ఏమిటో సెలవివ్వండి' అన్నాడు రాజు.

'ప్రస్తుతం తెనుగుభాష ఒకదారీ తెన్నూ లేకుండా ఉంది వ్యాసభారతంలోని గొప్ప భావాలను తెనిగించిచెప్పాలంటే ఈ భాషలో సామగ్రిచాలదు ఏదో విధంగా రాద్ధాంతపోనీ అనుకున్నా మరొక్క సందేహంకూడా వెనక్కిలాగుతోంది' అన్నాడు నన్నయ

'అదికూడా సెలవివ్వండి' అన్నాడు రాజు

'దేశభాషలో రచనఅంటే నేటి పండితులెవరూ హర్షించరు. భారతాన్ని తెనిగించడం విశేషమైన శ్రమతో కూడుకున్న పని. పండితుల ఆదరణ పొందనినాడు నా శ్రమ అంతా వృథా ఐపోతుంది' అన్నాడు నన్నయ.

రాజు 'నేటి పండితులు హర్షించకపోతే పోవచ్చు మీ రచన రాబోయే కవులకు మార్గదర్శకమై మీరు 'ఆదికవి' అనిపించుకుంటారు ప్రజలమేలే మనస్సులో పెట్టుకుని రచనకు పూనుకోవాలనికోరుతున్నాను' నామాట తోసెయ్యకండి తెనుగుభాషలో దారీ తెన్నూ లేదనికదూ అన్నారు? ఈ భాషకు కట్టుబాట్లు చెయ్యగల సమర్థులు కూడా మీరే ముందు ఆపనిచేసి, భారత ఆంధ్రీకరణానికి దీక్ష వహించండి' అన్నాడు

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

పాలంకి వెంకటరామ
చంద్రమూర్తి

◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆◆

నన్నయ 'సరే' అన్నాడు 'ఆంధ్రశబ్ద చింతామణి' అనే వ్యాకరణాన్ని రచించి, భాషకు నియమాలు ఏర్పరచాడు ఈ విధంగా ఆ మహాపండితుడు వాక్కులను అనుశాసించి, 'వాగనుశాసనుడు' అనే పేరు సంపాదించాడు.

ఆ పిమ్మట సంస్కృతభారతాన్ని తెనిగించడం ప్రారంభించాడు. భారతంలో పద్దెనిమిది భాగాలున్నాయి ఒక్కొక్క భాగాన్నీ ఒక 'పర్వం' అంటారు నన్నయ ఆదిపర్వం, సభాపర్వం పూరిచేసి, అరణ్యపర్వంలో సగందాకా వచ్చాడు అప్పుడో తలవని తలంపుగా ఒక్క విపత్తు వచ్చింది

నన్నయరచనను, కృతిపద్యం మొదలుగా గల పద్యాలన్నింటనీ ఎప్పటికప్పుడువింటూ ఆనందించిన రాజరాజునకు చక్రకోట్యపు రాజుతో యుద్ధం సంభవించింది ఆ యుద్ధములో ఆయన ప్రాణాలను గోల్పోయి వీరస్వర్గ మలంకరించవలసవచ్చింది

వేంగి రాజ్యం దాయాగులపరమైంది యువరాజైన రాజేంద్రచోళుడు సమర్థుడైకూడా దాయాదులతో కలహించడం ఇష్టపడక రాజమహేంద్రవరాన్ని వదలి కాంచీపురానికి పోయి దాన్ని రాజధానిగా చేసుకుని పాలించాడు.

చెట్టు పడిపోతే దాన్ని ఆశ్రయించుకొని ప్రాకుతోన్న లత కూడా ఎండిపోతుంది. రాజరాజుతోపాటు నన్నయార్యుని ఉత్సాహమంతా నశించిపోయి, ఆయన రచన అరణ్యపర్వం మధ్యంలోనే ఆగిపోయింది.

నన్నయభట్టు మరణానంతరం నూటయాభైయేళ్లు గడిచిపోయాయి తర్వాత ఆయనవంశంలో పుట్టినపండితుడొకడు అటకమీది తాటాకు పుస్తకాలను తిరగేస్తోంటే నన్నయ రచించిన అసంపూర్ణ భారతం కనిపించింది. 'ఇలాంటి మహోత్కృష్టమైన గ్రంథం అసంపూర్తిగా ఉండిపోయిందే!' అని ఆ బ్రాహ్మణుడు విచారించాడు 'ఈ గ్రంథాన్ని పూర్తిచేయగల మహాకవి లేకపోతాడా?' అన్న ధైర్యంతో ఆయన ఆ గ్రంథాన్ని పుచ్చుకుని, ఆంధ్రరాజుల ఆస్థానాలన్నీ దర్శించాడు.

దర్శించి, ఆ గ్రంథంలోని పద్యాలు కొన్ని చదివి, మెప్పించి, 'ఇతం గొప్పగా రచించిన ఆదికవి నన్నయభట్టారకుని శ్రమ వృథాకాకూడదు ఈ గ్రంథం పూర్తిఅయ్యే భారంమీది!' అనేవాడు

కాని ఆ భారాన్ని వహించడానికి ఏ ఆస్థాన కవీ సాహసించలేదు "భారతం మహాసముద్రంలాంటిది అంగులో పడ్డవాడు దరికిజేరడమంటూ ఉండదు పూర్తిచెయ్యాలంటే ఒకటీ, రెండూనా? ఇంకా పదిహేను న్నర పర్వాలున్నాయి! ఉభయభాషాకోవిదుడైన నన్నయభట్టారకుడేపూర్తి చెయ్యవలసింది ఆయన సామర్థ్యం మరెవరికీ లభించదు. మేం సాహసించి రచనకు పూనుకున్నా ఆయన శైలికీ మా శైలికీ ఏనుగుకూ దోమకూ ఉన్నంతవార ఉంటుంది... మరొక్క భయంకూడా ఉంది కవి రచన ఈ అరణ్యపర్వంలో ప్రవేశించేసరికి కృతిపతి ఐన రాజరాజుకి ఆయుష్షు చెల్లిపోయింది! దానితో కవికి మతిచలించి, గంటం ఆగిపోయింది! రచించాలంటే వేరే గ్రంథాలు ఉన్నాయి అరణ్యంలో చొరబడడం దేనికి?" అని అందరూ వెనుకతీసేవారు.

ఆ వేంగి బ్రాహ్మణుడు ఆశాభంగంతో స్వగ్రామానికి తిరిగిపోతోంటే ఆంధ్రుల అదృష్టం కొద్దీ నెల్లూరి సీమనుండి వచ్చిన పండితుడొకడు వానికి తారసిల్లాడు అతడు 'ఆర్యా, ఈ గ్రంథాన్ని పూర్తి చేయగల

★ ఆంధ్ర మహాభారతం ★

మహాకవి ఈ రాజు గారి ఆస్థానంలో ఉన్నాడు. ఆ రాజు కూడా రాజరాజేంద్రునివలెనే కవులను ప్రోత్సహించే ప్రభువే' అన్నాడు.

'ఎవరు నాయనా మీ ప్రభువు?' అని అడిగేడు వేంగిబ్రాహ్మణుడు.

'నెల్లూరు మండలానికి అధీశ్వరుడు, మనుమసిద్ధి భూపాలుడు. ఆయన మంత్రి పుంగవుడే ఈ కవిరాజు' అన్నాడు నెల్లూరు పండితుడు.

'ఆయన పేరు?'

'తిక్కనార్యుడు'

వేంగిబ్రాహ్మణుడు ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా నెల్లూరుకు ప్రయాణమై పోయాడు. ఆ కాలంలో నెల్లూరును 'విక్రమసింహపురం' అనే వారు.

వేంగిపండితుడు మనుమసిద్ధి నృపాలుణ్ణి దర్శించి తన రాకకు కారణం చెప్పినప్పుడు తిక్కన కవీశ్వరుడు అక్కడే ఉన్నాడు.

మనుమసిద్ధి కథంతా విని, తిక్కన్నగారి వైపు చూస్తూ, 'దీనికి మీరే సమర్థులు!' అన్నట్టుగా ఒక్క చిరునవ్వు నవ్వాడు.

తిక్కన్నగారు బ్రాహ్మణుని వైపు తిరిగి, 'అయ్యా, గ్రంథం విప్పి ఒక పద్యాన్ని విని పించండి,' అన్నాడు.

బ్రాహ్మణుడు తన దేశాటనం ఫలించబోతోందన్న ఉత్సాహంతో పుస్తకం తెరిచి గొంతెత్తి—

మదమాతంగ తురంగ కాంచనలస
న్మాణిక్య గాణిక్య సం
పద లోలిం గొనితెచ్చి యిచ్చి ముద
మొప్పం గాంచి సేవించిరా
యుదయాస్తాచల సేతు శీతనగ మధ్యోర్వీ
పతుల్ సంతతా
భ్యుదయున్ ధర్మజు దత్సభాస్థితు జగ
త్పూర్ణప్రతాపోదయున్

అన్న పద్యాన్ని చదివేడు.

'ఓహో! ఈ కవితాధార అమృత ప్రవాహం!' అని మెచ్చుకున్నాడు తిక్కన.

'నన్నయ్యగారు సంస్కృత పదాలనే ఎక్కువగా వాడినారు.' అన్నాడు మనుమసిద్ధి

'ఔను. ఆయనకాలంలో ఇప్పుడున్నన్ని తెలుగు మాటలు లేవు మరి. మనం రాయాలంటే ఇప్పుడు వాడుక మాటలూ, సామెతలూ, జాను తెనుగు నుడికారాలూ ఎన్నో చేర్చవచ్చు' అన్నాడు తిక్కనార్యుడు.

'గ్రంథమంతా ఒకే పద్ధతిలో ఉండాలంటే, నన్నయగారు ఆపివేసిన అరణ్యపర్వ మధ్యంలో గాక మళ్ళీ ఆదిపర్వం నుండీ ప్రారంభించడం మేలు' అన్నాడు రాజు.

తిక్కనార్యుడు ఆ సూచన ఆమోదించ లేదు. 'నన్నయభట్టారకుడు ఆంధ్రకవితా విశారదుడు. ఈ మూడుపర్వాల రూపంలోనూ ఈ ఆదికవి కవిత్వం లోకానికి ఆదర్శంగా నిలిచిపోవలసిందే.' అన్నాడాయన.

'ఐతే, ఆయన వదలివేసిన చోటనే ఆరంభించండి పోనీ' అన్నాడు రాజు.

'ప్రస్తుతం అరణ్య పర్వంలోని శేష భాగాన్ని అలాగ వదిలెయ్యడమే మంచిదనిపిస్తోంది నామటుకి. విరాటపర్వం మొదలు స్వర్గారోహణ పర్వంవరకూ ఉన్న మిగతా పదిహేను పర్వాలూ రచించడానికి పూనుకుంటాను' అన్నాడు తిక్కన.

రాజు చిరునవ్వుతో, 'అరణ్య పర్వంలో శేషభాగాన్ని పూర్తి చెయ్యబోతే చెడిపోతుందేమో అన్న భయం మీకు కూడా కలుగుతోందా?' అన్నాడు.

తిక్కన రాజుతో, 'భయం కాదు. ఏ కారణంచేతనైనా విఘ్నం కలిగితే నా ప్రయత్నమంతా అక్కడితోనే ఆగిపోయి, మిగతా పదిహేను పర్వాలూ అలాగే ఉండిపోతాయి. అవి తెనుగులోకి అవతరించాక ఈ శేషభాగం మాట చూడవచ్చును.' అన్నాడు

మనుమసిద్ధి, 'సరే' అన్నాడు. వేంగి బ్రహ్మణునితో, 'ఇంక మీరు నిశ్చింతగా ఉండవచ్చు. మా తిక్కన కవీంద్రులవారు ఆంధ్రలోకమంతా ఆనందించేటట్లు మహాభారతాన్ని తెనిగిస్తారు లెండి.' అని చెప్పి, సత్కరించి పంపేశాడు

పదిహేను పర్వాలు రచించటమంటే సామాన్యమైన పని కాదు. ఎంతో దీక్ష కావాలి. తిక్కన్న, రాజుతో, 'దీక్ష కుదరాలంటే యజ్ఞం చెయ్యాలి' అన్నాడు.

మనుమసిద్ధి యజ్ఞానికి కావలసిన ప్రయత్నాలన్నీ వెంటనే చేయించాడు. తిక్కన యజ్ఞంచేసి సోమయాజి అయ్యాడు.

కాని ఆయన రచన ప్రారంభించలేదు. మనుమసిద్ధి, 'మామా, ముహూర్తం కుదుర



డిస్ట్రిబ్యూటర్లు: మెసర్సు జి కె నాగనాథన్, కర్నూలు.
,, శ్రీ వెంకటేశ్వర ట్రేడింగ్ కంపెనీ, రాజమండ్రి
శ్రీ శంకర్ జనరల్ స్టోర్స్, శ్రీకాకుళం.

లేదా?' అన్నాడు. ఆ రాజు తిక్కనార్యుని ఎప్పుడూ 'మామా' అని పిలిచేవాడు.

తిక్కన, "మహాకార్యం కుదురక కాదు. నేను పద్యాలను ఆశువుగా చెప్పుకు పోతోంటే, నాతో సమంగా రాసుకుపోయే వాడు కావాలి. 'అలాంటి వాడెవరు?' అని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

'ఆలోచించి చెప్పండి. అతనికోసం ఎంత సొమ్మైనా వెచ్చిస్తాను. ఎక్కడున్నా రప్పిస్తాను!' అన్నాడు రాజు

'మా స్వగ్రామంలోనే గురునాథుడనే కుమ్మరి ఒకడున్నాడు వాని దస్తూరీ చక్కనిది సాహిత్యంలో కొంత కృషి చేసినవాడు కూడాను అతణ్ని రప్పించండి' అన్నాడు తిక్కన సోమయాజి

కొద్దిరోజులలోనే గురునాథుడు తిక్కన సమక్షంలో నిలిచి నమస్కరించాడు.

"సోమయాజి ఆ యువకుణ్ణి ఆశీర్వదించి వ్యాసమహర్షి భారత శ్లోకాలను ఆశువుగా చెప్పుకు పోతోంటే విఘ్నేశ్వరుడు ఆయనతో సమంగా గంటంతో రాసుకుపోయాడు. అలాగే నువ్వు నాపద్యాలను ఎక్కడా ఆగకుండా రాయాలి ఆగిపోయి, 'ఏమిటండీ?' అని అడిగేవా, నా ధార అడ్డిపోతుంది!" అన్నాడు

గురునాథుడు, 'ఆ ప్రమాదం రానివ్వను, నా గంటం ఆగిపోవడమే తటస్థించినవాడు నా చేతిని నరికేసు కుంటాను!' అన్నాడు.

తిక్కన, 'ఔరా, ఎంతశపథం చేశావు! ఐతే నేను కూడా ఇలాంటి ప్రతిజ్ఞయే చేస్తాను. నా ధార ఎప్పుడు ఆగిపోతే అప్పుడు నా నాలుక కొగ్గోసు కుంటాను!' అన్నాడు.

మనుమసిద్ధి ఆ ఘోరశపథాలను విని, ఏం ముప్పు రానున్నదో అని కొంచెం భయపడ్డాడు. కాని వారిద్దరూ సమర్థులే అనీ, శపథాలు నిలబెట్టుకోగలవారే అనీ తోచి ధైర్యం తెచ్చుకున్నాడు.

వచ్చి పోయేవాడు కనపడుతోంటే దృష్టి చెదిరి ఏకాగ్రతకుదరదని చెప్పి, తిక్కన తెర ఒకటి కట్టించి దానిలోపల కూర్చున్నాడు తెర అవతల గురునాథుడు తాటాకులూ, గంటం పుచ్చుకొని సిద్ధంగా ఉన్నాడు

'ఈ మహోత్కృష్ట గ్రంథాన్ని ఏ దేవుడికి కృతి నివ్వడం?' అనిపించింది తిక్కనార్యునికి

'మహాదేవుడైన శివునికి ఇవ్వండి.' అన్నాడు రాజు.

'మహావిష్ణువుకు ఇచ్చినా ఇవ్వవచ్చును.' అన్నాడు గురునాథుడు

"శివుడన్నా విష్ణువన్నా ఒకడే ఈ సంగతిగుర్తించలేక మతావేశంతో శైవులూ, వైష్ణవులూ ఒకాళ్ళ నొకాళ్లు దూషించు



కాంతిచ్ఛట

కోడం, కొన్నిచోట్ల చంపుకోడం కూడా జరుగుతోంది. హరిహరాత్మకమైన ఆ దివ్యమూర్తిని, 'విష్ణురూపాయ నమశ్శివాయ' అని స్తుతించి, ఉభయ మతాలవాళ్ళకూ జ్ఞానబోధ చేస్తాను" అని నిశ్చయించుకుని, తిక్కన ఆ స్తుతి పద్యంతో ఆంధ్ర మహాభారత రచన విరాటపర్వంవద్ద ప్రారంభించి సాగించాడు.

మొదలు పెట్టడమే తడవుగా రచన అడ్డులేకుండా సాగిపోయి, విరాట, ఉద్యోగ, భీష్మ, ద్రోణ, కర్ణ పర్వాలు ఐదూ ఒక్కొక్కటే పూర్తి అయాయి. శల్యపర్వం ప్రారంభమై మొదటి ఆశ్వాసం చివరికి వచ్చాడు తిక్కనకవి. యుద్ధంలో శల్యుడు కూడా పడిపోయాడు సంజయుడు గుడ్డిరాజు ధృతరాష్ట్రునితో తర్వాతి కథ చెప్తున్నాడు. తిక్కనగారు—

"వలపలని మూకలో గాల్
నిలుపక గుఱ్ఱంబుదిగ్గి నీ కొడుకు గదా
కలిత భుజుండై యొక్కడు
దొలగి చనియె—"

అన్నంతవరకూ చెప్పి, పద్యం ఎలా పూర్తి చెయ్యాలో తోచక, 'ఏమి చెప్పుదును గురునాథా!' అంటూ తెర అవల రాస్తోన్న గురునాథుణ్ణి పిలిచి, 'ధార ఆగిపోయింది కత్తితే నాలుక కోసుకుంటాను' అన్నాడు.

గురునాథుడు, 'ఏమి చెప్పుదును గురునాథా!' అన్నది పద్యభాగమే అనుకుని గంటంతో రాసేసి, 'కత్తి తెమ్మం'టూన్న సోమయాజిగారితో 'కత్తి దేనికండీ?' అన్నాడు.

తిక్కనగారు, 'ధార అడ్డిపోయింది కాదా మరి? పద్యం పూర్తిచెయ్యలేకపోయాను!' అన్నాడు.

"పద్యం పూర్తి కాకపోడమేమిటండీ? 'తొలగి చనియె నేమి చెప్పుదును గురునాథా!' అని రాసుకున్నాను సరిగానే ఉందే. 'గురునాథా' అంటే 'ధృతరాష్ట్రుడా' అని సంజయుడు సంబోధిస్తున్నట్లు చెప్పేరనుకున్నాను. కాదా?" అన్నాడు గురునాథుడు.

సోమయాజి సంతోషించి,

"గురునాథా, నీవు 'గురు'నాథుడవు కాని, కుమ్మరి గురునాథుడవు కావు! నేను నీతో అన్నదానితోనే పద్యం పూర్తిచేసి, నాకు స్ఫురించని అర్థాన్ని చెప్పి నా ప్రతిజ్ఞ నిలబెట్టేవు!" అని మెచ్చుకున్నాడు.

ఆ తర్వాత అలాంటి ఉపద్రవం ఏదీ రాకుండా తిక్కన సోమయాజి భారతం పదిహేను పర్వాలనూ పూర్తిచేశాడు.

మనుమసిద్ధి పదే పదే పద్యాలన్నీ చదివించుకుని వింటూ ఆనందించి, అటువంటి కవిబ్రహ్మ తనకు మంత్రీ ఆస్థానకవీ ఐనందుకు పొంగిపోయాడు

ఒకనాడా రాజు, 'అరణ్య పర్వంలో మిగిలిపోయిన ఆ భాగాన్ని కూడా తెనిగించెయ్యరాదా?' అని అడిగేడు. సోమయాజి

★ ఆంధ్ర మహాభారతం ★

గారు సమాధానం ఏమీ చెప్పక పూర్వమే వారికి రణదుందుభుల మ్రోత వినిపించింది

రాజు ఉలిక్కిపడి లేచి, 'ఏమిటి?' అనే వరికి, 'శత్రువులు వచ్చి పట్టణాన్ని ముట్టడించారు' అన్న వార్తను చెప్పేరు.

'శత్రువులా? ఎవరు? నాకు విరోధులు లేరే?' అన్నాడా అమాయకుడు!

'పై వాళ్లెవరూ కాదు మీ దాయాదులైన అక్కన్న, బయ్యన్నలే కుట్రచేసి ఆక్రమించుకున్నారు' అన్నారు చారులు

ఆ మాట వినడంతోనే మనుమసిద్ధికి ఏమీ తోచింది కాదు కంగారుగా దిక్కులు చూస్తోంటే శత్రు సైనికులు చొరబడి రాజును బంధించి తీసుకుపోయారు.

దాంతో సోమయాజిగారికి ఆశ్రయం పోయింది కాని అందు కాయన విచారించలేదు. 'మంత్రినై యుండీ, ఆపదలోంచి ప్రభువును రక్షించుకోలేకపోయాను!' అని దిగులు చెందాడు.

ఆలోచించగా ఆయనకొక్క ఉపాయం తట్టింది. వెంటనే బయల్దేరి ఓరుగల్లు పట్టణం చేరుకున్నాడు

ఇప్పుడు తెలంగాణంలోని 'వరంగల్' అన్న పట్టణమే ఓరుగల్లు. ఆ కాలంలో ఈ నగరం కాకతీయ సామ్రాజ్యాధిపతియైన గణపతి దేవచక్రవర్తికి రాజధానిగా ఉండేది

గణపతిదేవుడు పరాక్రమవంతుడనీ, కళాపోషకుడనీ, కవిజన కల్పవృక్షమనీ, ప్రసిద్ధికెక్కిన ఆంధ్ర సార్వభౌముడు నెల్లూరు మండలము దూరదేశమే ఐనా ఆ చక్రవర్తి తిక్కన సోమయాజి భారతాన్ని గూర్చి ఇదివరలో విన్నాడు. ఆ 'కవిబ్రహ్మ' తన రాజధానికి వస్తున్నాడని తెలియడంతోనే చక్రవర్తి ఎదురుగాపోయి స్వాగతమిచ్చి తీసుకొచ్చాడు

తిక్కన సోమయాజి చక్రవర్తి ఆదరణకు పాత్రుడై తన భారతాన్ని వినిపించాడు. ఆ గ్రంథరాజంలోని విశేషాలన్నీ ఆయన ముఖతః విని చక్రవర్తి పరమానంద భరితుడై, ధనకనకవస్తువాహనాలనూ అగ్రహారాలనూ ఇచ్చి గౌరవించాడు.

తిక్కన సోమయాజి, 'ప్రభూ, నన్నింతవరకూ పోషించిన మనుమసిద్ధి భూపాలుడు, ఇప్పుడు దాయాదుల చేజిక్కి చెఱలో ఉన్నాడు శత్రువులను పారదోలి, ఆయనను చెఱనుండి విడిపించాలని కోరడానికి వచ్చాను' అని అసలు విషయం చెప్పాడు.

గణపతిదేవుడు తిక్కన రాజభక్తికి మెచ్చుకుని, మర్నాడే చతురంగ సేనతో నెల్లూరుకు పోయి అక్కన్న బయ్యన్నలను పారదోలి మనుమసిద్ధిని తిరిగి సింహాసనంమీద కూర్చో బెట్టేడు.

అరణ్యపర్వంలో మిగిలిపోయిన భాగాన్ని మాత్రం తిక్కన ముట్టుకోలేదు మరో నూటయాభై యేళ్ళవరకూ ఆ శేషభాగం అలాగే ఉండిపోయింది

తర్వాత వేమభూపతి అనే కొండవీటిరెడ్డి ప్రభువు, తన ఆస్థానకవియైన ఎఱ్ఱాప్రెగ్గడను అరణ్యపర్వంలో మిగిలిపోయిన దాన్ని పూర్తిచెయ్యవలసిందని కోరేడు.

ఎఱ్ఱాప్రెగ్గడ 'హరివంశం' లాంటి గొప్ప ప్రబంధాలు ఎన్నో రచించి 'ప్రబంధ పరమేశ్వరుడు' నే బిరుదును సంపాదించిన గొప్పకవి.

ఆయన సమర్థుడై కూడా అరణ్యపర్వ శేషాన్ని పూర్తి చెయ్యడానికి తిక్కన కవులకు మల్లేనే మొదట సందేహించాడు

కాని వేమారెడ్డి 'మీరు తీర్చకపోతే ఈ లోపం ఇలాగే ఉండిపోతుంది.' అన్నాడు.

ప్రభువుమాట కాదనలేక ఎఱ్ఱాప్రెగ్గడ అరణ్యపర్వంలోని శేషభాగాన్ని పూర్తి చేశాడు.

ఈ విధంగా ఆంధ్ర భారతం అవతరించింది మూడు కాలాలకు సంబంధించిన ముగ్గురు మహాకవులు రచించారు దీన్ని. ఈ కవిత్రయం, వీరిని ప్రోత్సహించిన రాజులూ, ఆంధ్రచరిత్రలో శాశ్వతమైన స్థానాన్ని సంపాదించుకున్నారు ★

మహత్తరమైన విశాలాంధ్రావతరణ, మంగళకరమైన దీపావళి శుభసమయమున మా అభినందనలు

ఓం తత్ సత్

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి

"మేల్‌మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్టురోగ నివారిణి

భయంకరమైన మేహవ్యాధివల్ల కష్టపడు వారలకు పునర్జన్మమిచ్చు

అద్భుత సంజీవి మేహరోగ నివారణ నూనె, లేహ్యము

నల్లమేహ, ఎఱ్ఱమేహ, పొడలు, మేహరణములు, తిమ్మర్లు, మతిమాంద్యము, కుష్ఠములు, పిత్తకారికము, సూతకవ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్లచేతులు మంటలు, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం, మూలవ్యాధి, మలబద్ధకము మొదలైన అన్ని విధముల దుర్వీరు వ్యాధులను అతి సులభముగా పోగొట్టును

40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యము 6-0-0 తపాల్ ఖర్చు వేరు వివరములకు కేట్లాగులో చూడవచ్చును

K. T. కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు, 5/22, మేల్‌మాయిల్ పోస్టు (N. A. Dt.)